సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం ׀ 4 ׀ డిసెంబర్ ׀ 2023



కనుల పండువగా లక్షార్చన

ప్రొద్దుటూరులోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్పస్వామి లక్షార్చన మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు.

-10లో



బౌలర్ల హవా

కడపలోని కేఎస్ఆర్ఎం మైదానంలో జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ జోన్, సెంట్రల్ జోన్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్ రెస్ట్ ఆఫ్ జోన్ బౌలర్లు రాణించారు.

-10లో

గరిష్టం/కనిష్టం
27.7/23.5

వాతావరణం

జిల్లాలో ఆదివారం 23.5 – 27.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వేగంగా పింఛన్ల పంపిణీ

కడప రూరల్: వైఎస్సార్ పింఛన్ కానుక కింద జిల్లా వ్యాప్తంగా వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోంది. మొత్తం 2,63,502 పింఛన్లకుగాను మూడో రోజైన ఆదివారం 2,54,193 మందికి నగదును పంపిణీ చేశారు. దీంతో 96.47 శాతం పింఛన్ల పంపిణీ నమోదైంది. జిల్లాలో తుఫాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్నప్పటికీ వలంటీర్లు అర్హులైన పింఛన్‌దారుల ఇంటింటికి వెళ్లి పింఛన్ నగదును అందజేయడం పట్ల అవ్వాతాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శుభ్రత పాటించాలి



ట్రిపుల్ ఐటీ ఆవరణలో చెత్త తొలగిస్తున్న వలంటీర్లు

వేంపల్లి: ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. ఆదివారం జాతీయ సేవా సమితి విభాగం–1 ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో వలంటీర్లు మెటలార్జికల్ ఇంజినీరింగ్ విభాగం వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ రమేష్ మాట్లాడుతూ సుమారు 70మంది వలంటీర్లు డిపార్ట్‌మెంట్ బిల్డింగ్ పరిసరాలను శుభ్రపరి చారన్నారు. కో.ఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన వలంటీర్లు, ప్రొగ్రాం ఆఫీసర్లను ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అభినందించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా క్యాంపస్‌ను ప్రీ ప్లాస్టిక్ క్యాంపస్‌గా ఏర్పాటు చేయాలని వలంటీర్లకు, ప్రొగ్రాం అధికారులకు డైరెక్టర్ పిలుపునిచ్చారు.

గండికోట సందర్శన



జుమ్మా మసీద్ వద్ద సెక్రటేరియట్ ఉద్యోగులు

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు మండలంలోని పర్యాటక ప్రాంతమైన గండికోటను ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ మహిళా అధికారులు సందర్శించారు. ఆదివారం వీరు ఇక్కడి పెన్నానది, మాధవరాయ ఆలయం, జుమ్మా మసీద్, పెన్నాలోయ, కోనేరును చూసి పరవశించిపోయారు. అనంతరం వారు మాట్లాడుతూ గండికోటలో ఉన్న కోట అందాలు ఆకట్టుకున్నాయన్నారు. కార్యక్రమంలో సచివాలయ యూనియన్ అధ్యక్ష్యురాలు వైదూరి దేవి, ఉపాధ్యక్షురాలు లక్ష్మణ కుమారి, సెక్రటరి సుస్మిత, జాయింట్ సెక్రటరి రాజేశ్వరి, ట్రెజరర్ శారద తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: ప్రముఖ శైవక్షేత్రమైన మల్లయ్యకొండకు కార్తీకమాసం పురస్కరించుకుని సోమవారం నాలుగు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి ఉదయం 5.30, 6.30, 7.30లకు బయలుదేరి తంబళ్లపల్లె రాగా మాను సర్కిల్ నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ తిరుగుతాయన్నారు. మరొక బస్సు ఉదయం 5 గంటకు నేరుగా మల్లయ్యకొండకు, మదనపల్లెకు తిరుగుతుందని వివరించారు.

స్విమ్మింగ్ జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్టుతో అసోసియేషన్ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్: కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో ఆదివారం జిల్లాస్థాయి స్విమ్మింగ్ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలను జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్. రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 16, 17 తేదీల్లో పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ శిక్షకుడు ధనుంజయరెడ్డి, సీనియర్ జాతీయ క్రీడాకారుడు యోగీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు..

గ్రూప్–1 బాలబాలికలు: రామకృష్ణ, మాధవ, శోభన, హేమలత

గ్రూప్–2 బాలబాలికలు: నాగవర్ధన్, యశ్వంత్, దినేష్, కార్తిక్‌దేవరాయల్, దేవి, మోక్షప్రియ, దీక్షిత.

గ్రూప్–3 బాలబాలికలు: జాన్ అఖిలేష్, మోక్షిత్, నిఖిలేష్, షణ్ముఖ్, త్రిభువన్‌రెడ్డి, శ్రీవెంకటసాయి, కావ్యశ్రీ.

జడివాన

- జిల్లా అంతటా వర్షం
- సిద్దవటంలో 7.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- శనగ, వేరుశనగ సాగు రైతుల్లో చిగిరిస్తున్న ఆశలు



రాజుపాలెంలో సాగులో ఉన్న పత్తిపంట



కడపలోని ఐటీఐ సమీపంలో రహదారిపై నిలిచిన వర్షం నీరు

కడప అగ్రికల్చర్: మిచాంగ్ తుపాను కలవరపెడుతోంది. ఇప్పటికే జిల్లాలో వర్ష ప్రభావం కనిపిస్తోంది. వరి కోతకు వచ్చిన దశలో వానలు పడుతుండడంతో రైతన్నలో ఆందోళన మొదలైంది. ఇప్పటికే తుఫాను ప్రభావంతో ఆదివారం ఉదయం నుంచే పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటోంది. జిల్లాలోని సిద్దవటంలో అత్యధికంగా 7.6 మిల్లీమీటర్లు, తొండూరులో మాత్రం 0.6 మిల్లీమీటర్ల అత్యల్ప వర్షపాతం నమోదైంది. నేడు, రేపు కూడా వర్షాలు కొనసాగనున్నాయని వాతావారణ నిపుణులు తెలియజేస్తున్నారు.

ఆరుతడి పంటలకు ఊపిరి

జిల్లాలో కొన్నిరోజులుగా వర్షం లేక సాగు చేసిన పలు ప్రాంతాల్లో ఆరతడి పంటలు ఎండుముఖం పట్టాయి. ఈ వర్షం వీటికి కొంతమేర ఊపిరి నిచ్చిందనే చెప్పాలి. వరి రైతుల్లో మాత్రం కొద్దిగా అందోళన నెలకొంది. జిల్లాలోని బోరుబావులు, నదీపరివాహక ప్రాంతాలు, కేసీ కాలువ కింద కొందరు వరి పంట సాగు చేశారు. కొన్ని చోట్ల చిరుపొట్టదశలో ఉంది. వర్షం నీరు పొట్టలోకి వెళ్లి తెల్లకంకి పడుతుందేమోనని రైతులు అందోళన చెందుతున్నారు. కానీ ఇబ్బంది ఉండదని వ్యవసాయ అధికారులు అంటున్నారు. ప్రస్తుతం సన్నగా గాలి లేకుండా వాన కురుస్తుండటంతో అంత ఎఫెక్టు ఉండదని వారు తెలిపారు. జిల్లాలోని చాలా మండలాల్లో ఆరుతడి పంటలైన పత్తి, మినుము, జొన్న, సజ్జ వంటి పంటలు సాగు చేసిన రైతులు మాత్రం హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే చాలా మండలాల్లో ఈ వర్షం శనగ, వేరుశనగ పంటల సాగుకు అనుకూలించనుంది.వాన తగ్గగానే రైతులు శనగ, వేరుశనగలను సాగు చేసే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం సబ్సిడీతో శనగ, వేరుశనగ విత్తనాలను ఇప్పటికే కూడా పంపిణీ చేసింది. వాన ఆగిపోగానే సాగును ఆరంభించే అవకాశాలు ఉన్నాయి. దాదాపు రెండు లక్షల ఎకరాల్లో శనగ, వేరుశనగ పంటలు సాగయ్యే అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు

మండలం వర్షపాతం (మి.మీలలో)

సిద్దవటం	7.6	సింహాద్రిపురం	2.2
సీకెదిన్నె	5.2	మైదుకూరు	2.0
ఒంటిమిట్ట	4.8	వేముల	2.0
బద్వేల్	4.2	గోపవరం	1.8
ఖాజీపేట	3.8	బి. మఠం	1.4
పొద్దుటూరు	3.8	పెండ్లిమర్రి	1.2
చెన్నూరు	3.8	ముద్దనూరు	1.2
పులివెందుల	3.4	చాపాడు	1.2
కడప	3.2	చక్రాయపేట	1.2
వల్లూరు	2.4	లింగాల	1.0
అట్లూరు	2.4	తొండూరు	0.6

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్



కడప సెవెన్‌రోడ్స్: మిచౌంగ్ తుపాను ఈనెల 4, 5 తేదీల్లో జిల్లాలోకి ప్రవేశించే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయరామరాజు కోరారు. భారీ వర్షాలు, ఈదురు గాలుల వల్ల కరెంట్ మోటార్లు మునిగి ఉండడం, స్టార్టర్స్, డబ్బాలు తడిసి ఉండడం, విద్యుత్తు తీగలు డ్యామేజెస్ కావడం జరిగే అవకాశం ఉందని, రైతులు, ప్రజలు వాటి దగ్గరకు వెళ్లే ప్రయత్నం చేయరాదన్నారు.తడి చేతులతో ఇళ్ళలోని స్విచ్ బోర్డులను ముట్టుకోరాదన్నారు. ఈదురు గాలుల వల్ల చెట్లు రహదారులకు అడ్డంగా పడిపోయినప్పుడు వాటిని వెంటనే తొలగించేందుకు అవసరమైన యంత్రాలను, పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలందరూ అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని, ఇళ్లల్లోనే సురక్షితంగా ఉండాలని, ప్రమాదకరంగా నీరు ప్రవహించే కల్వర్టుల వద్ద వాహనాల రాకపోకలను నియంత్రించాలని అధికారులకు సూచించారు. వైద్య సేవలకు అంతరాయం కలగకుండా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులను సిద్ధంగా ఉంచుకోవాలని వైద్యశాఖాధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. టెలికాం సేవలు దెబ్బతిన్నపుడు.. వెంటనే ఆ సేవలను పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించడానికి అవసరమైన ఆహార ధాన్యాలను గోదాముల్లో సిద్ధంగా ఉంచుకోవాలని పౌరసరఫరాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో ఆరబెట్టుకోవాలి

వాతావరణశాఖ తుపాన్ హెచ్చరికలను జారీ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. గింజ గట్టిబడి కోతకు సిద్ధంగా ఉన్న వరిలో సత్వరమే కంబైన్డ్ హార్వెస్టర్ ఉపయోగించి వచ్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో ఆరబెట్టుకోవాలని తెలిపారు. తగినన్ని టార్పాలిన్, పాలిథిన్ పట్టలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వరిపంట కోసి ఓదెలు చేనులో ఉండే పరిస్థితుల్లో తక్షణమై ఓదెలను కట్టలు కట్టి గూడు, కుప్పలు వేసి వర్షం నుంచి తడవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తడిసిన ఓదెల్లో మొలకలు రాకుండా 5 శాతం ఉప్పుద్రావణం పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ విషయంలో మండల వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

శివాలయ నిర్మాణానికి విరాళం



నగదు అందిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు: మండల పరిధిలోని ధర్మాపురంలో శివాలయ నిర్మాణానికి శాసనసభ్యుడు డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి లక్ష రూపాయల విరాళం ప్రకటించారు . ఆదివారం ఉదయం గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిశారు.ఈ సందర్భంగా ఆయన లక్ష రూపాయల నగదును అందించారు. కార్యక్రమంలో రామాంజనేయుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మదనపల్లెలో ఉర్దూ కవి సమ్మేళనం

మదనపల్లె సిటీ: కవులు,సాహితీపరుల జిల్లాగా ఖ్యాతి గాంచిన అన్నమయ్య జిల్లాలో తెలుగుతో పాటు ఉర్దూ సాహిత్యం పరిమళిస్తోంది. కవి సమ్మేళనాలు, సాహితీ సదస్సులు, నాటకాలు ఇలా పలు అంశాలలో జిల్లాకు చెందిన రచయితలు, కవులు తమ సాహిత్యప్రతిభను చాటుతున్నారు.మదనపల్లెలో ఈ నెల 4న సోమవారం జాతీయ స్థాయి ఉర్దూ కవి సమ్మేళనం జరగనుంది. స్థానిక న్ బడే మకాన్ దర్గాలో జరిగే ఈ సమ్మేళనానికి పలు రాష్ట్రాల నుంచి కవులు హాజరు కానున్నారని కవి సమ్మేళనం కన్వీర్ ఖమర్ అమీని ఆదివారం తెలిపారు.

అమెరికా స్టాన్ ఫోర్డ్‌కు మిట్స్ విద్యార్థులు

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థులు మునితనోజ్ వసంత పల్లె, లోకేష్ అయ్యస్వామి, అమేయ శ్రీకసా, ధరణి వేమూరి అమెరికాలోని ప్రముఖ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. వీరు ఇన్నోవేషన్ ఫెలోషిప్ ప్రోగ్రాంకు ఎంపికయ్యారన్నారు. కరస్పాండెంట్ విజయ భాస్కర్ చౌదరి వీరిని అభినందించారు.

ముగిసిన ప్రతిష్టా మహోత్సవం



భక్తులకు ఆశీర్వాదం ఇస్తున్న విచారణ గురువులు

కలసపాడు: కలసపాడు సగిలేరు ఒడ్డున వెలసిన పురాతన పరిశుద్ధ పరిపేతురు పరిపాలు ఆలయ 136వ ప్రతిష్టా మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాయలసీమ డయాసిస్ బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ పి.ఐజాక్‌వరప్రసాద్ భక్తులకు దైవసందేశం ఇచ్చారు. డీనరీ చైర్మన్ వరప్రసాద్, సంజయ్‌మధు, ఆశిస్‌గాబ్రియేల్, బేబీ సరోజ, రవిక్రీస్తుదారి, శ్రీనివాస్‌పాల్‌ల ఆధ్వర్యంలో సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉపాధ్యాయుడు కె.జె.ప్రవీణ్ (చిన్ను) చర్చి క్లుప్త చరిత్రను బిషప్ పి.ఐజాక్‌వరప్రసాద్ ఆవిష్కరించి 1000 ప్రతులను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. గుడిమె సుదర్శన్ వారి చెక్కభజన, గుమ్మడి జీవన్‌కుమార్ విజయవాడ వారి నిర్వహించిన దావీదు విజయం క్రై స్తవ నాటకం భక్తులను ఆకట్టుకున్నాయి. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోరుమామిళ్ల సీఐ చిరంజీవి, ఎస్ఐ నాగమురళి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



దైవసందేశం ఇస్తున్న డాక్టర్ ఐజాక్‌వరప్రసాద్

బుక్‌లెట్స్‌తో బహుళ ప్రయోజనాలు

కడప ఎడ్యుకేషన్: డిపార్టుమెంటల్ పరీక్షల బుక్‌లెట్స్‌తో ఉద్యోగ, ఉపాధ్యాయులకు బహుళ ప్రయోజనకరం అని జిల్లా జెఏసీ చైర్మన్ శ్రీనివాసులు, ఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి రవికుమార్ అన్నారు. ఆదివారం కడప ఎన్జీఓ భవన్‌లో ఏపీటీఎఫ్ అమరావతి డిపార్టుమెంటల్ పరీక్షల బిట్స్ బుక్లెట్స్ ఏపీటీఎఫ్ నాయకులు సీవీ ప్రసాద్, అలీఖాన్, ఈశ్వరచంద్ర, సుబ్బారెడ్డిలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వీస్‌రూల్స్‌ను బుక్‌లెట్‌లో పొందుపరిచారన్నారు. సీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఇంక్రిమెంట్లు, పదోన్నతులకు డిపార్టుమెంట్ పరీక్షలు అవసరం అన్నారు. ఉత్తీర్ణత సక్సెస్ రేటు ఉండే విధంగా బిట్స్ తయారు చేశామన్నారు. మాడల్ పేపర్లును కూడా ఇందులో పొందుపరిచామన్నారు.



బుక్‌లెట్స్‌ను విడుదల చేస్తున్న జేఏసీ చైర్మన్, ఎన్జీఓ జిల్లా కార్యదర్శి తదితరులు

విద్యుత్ శాఖకు బకాయిల షాక్

- కడప సర్కిల్‌లో రూ.1659 కోట్ల బకాయిలు
- ప్రైవేటు బకాయిలు రూ.898.89కోట్ల పైమాటే

కడప కార్పొరేషన్: విద్యుత్ శాఖకు బకాయిలు షాకిస్తున్నాయి. కడప సర్కిల్ అంటే ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు బకాయిలు కలిపి రూ1659 కోట్లు ఉండటం ఆ శాఖ అధికారులను కలవరపెడుతోంది. ఇందులో ప్రైవేటు బకాయిలు 595.89కోట్లు, ప్రభుత్వ బకాయిలు రూ.1063కోట్లు ఉన్నాయి. ఇందులో అత్యధికంగా పారిశ్రామిక బకాయిలు రూ.525 కోట్లు, అత్యల్పంగా లోకల్ బాడీస్ బకాయిలు రూ.23 లక్షలు ఉన్నాయి. ఈ బకాయిలను వసూలు చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.



విద్యుత్ భవన్

ఇందుకోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు.

- జిల్లాలో 1050720 గృహ సంబంధమైన కనెక్షన్లు ఉండగా, 416 హెచ్‌టీ కనెక్షన్లు, 134403 డీటీఆర్ సర్వీసులు, 1148 11కేవీ ఫీడర్లు, 302 33/11 కేవీ సబ్‌స్టేషన్లు ఉన్నాయి.

ప్రైవేటు బకాయిలు (కోట్లలో)

కేటగిరి	ఎల్‌టీ	హెచ్‌టీ	మొత్తం
డొమెస్టిక్	40.53	–	40.53
కమర్షియల్	4.21	12.10	16.22
ఇండస్ట్రియల్	2.67	525.56	527.67
లోకల్ బాడీస్	0.23	–	0.23
అగ్రికల్చర్	11.23	–	11.23

బకాయిల వసూలుకు చర్యలు



కడప సర్కిల్‌లో విద్యుత్ బకాయిలను వసూలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.వినియోగదారులు కూడా అర్థం చేసుకొని బకాయిలు చెల్లించి సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలి.

– రమణ, ఏపీఎస్‌పీడీసీఎల్. పర్యవేక్షక ఇంజినీరు

సంకల్పం ముందు వైకల్యం చిన్నబోతుంది



మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తదితరులు



ఉపకరణాలతో దివ్యాంగులు

- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- దివ్యాంగులకు రూ.77లక్షల విలువైన ఉపకరణాలు పంపిణీ

మైదుకూరు: సంకల్పం బలంగా ఉంటే వైకల్యం కూడా చిన్నబోతుందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. మైదుకూరులో ఆదివారం కేంద్ర న్యాయ సహాయ సాధికార శాఖ ఆధ్వర్యంలో, దివ్యాంగుల సాధికార సంస్థ దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలు, హియరింగ్, ఎయిడ్స్ వంటి ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ శారీరకంగా బాగా ఉన్న వారు కూడా దివ్యాంగుల ప్రతిభకు సరితూగరని అన్నారు. ఇందుకు మైదుకూరు నియోజకవర్గానికి చెందిన వినోద్ అనే యువకుడు మంచి ఉదాహరణ అని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు వైకల్యంతో వీల్ చైర్‌కు పరిమితమైన ఆ యువకుడు పట్టుదలతో ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తుండటం అందరికి ఆదర్శనీయమని తెలిపారు. కడప పార్లమెంట్ పరిధిలో రూ.5.85 కోట్ల విలువైన ఉపకరణాల పంపిణీ జరుగుతోందన్నారు. ఇప్పటికే కడప, జమ్మలమడుగు, పులివెందులలో పంపిణీ కార్యక్రమాలు జరిగాయన్నారు. జిల్లాలో ఉపకరణాల లబ్ధిదారుల కోసం నిర్వహించిన 42 శిబిరాల్లో 20వేల మందిని పరీక్షించారని తెలిపారు. ఇందులో 9,500 మందిని గుర్తించి ఉపకరణాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఉపకరణాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపకరణాల కోసం రూ.90లక్షలు ఎంపీ నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. దక్షిణ భారత దేశంలోనే ఎక్కడా ఇటువంటి కార్యక్రమం జరగలేదన్నారు. రాష్ట్ర ప్రజలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అన్ని వేళల్లో జగనన్న ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు.

అనంతరం ఎంపీ వైఎస్ , ఎమ్మెల్యే దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బద్వేలు ఆర్డీఓ ఆకుల వెంకటరమణ, నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ డి.గంగాధర్‌రెడ్డి, మైదుకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు మదీనా దస్తగిరి, శక్తిమిషన్ సభ్యురాలు మూలే సరస్వతమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, నియోజకవర్గంలోని అన్ని మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపకరణాలను సద్వినియోగం చేసుకోండి

దివ్యాంగులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మైదుకూరు నియోజకవర్గంలో 839 మందికి రూ.77లక్షల విలువైన మూడుచక్రాలవాహనాలు, బ్యాటరీ రిక్షాలు, వీల్ చైర్లు, హియరింగ్ ఎయిడ్స్ వంటి ఉపకరణాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నిధుల నుంచి రూ.30లక్షలు కేటాయించడం హర్షణీయమన్నారు. దివ్యాంగుల్లో మేధావులు ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రొద్దుటూరు మండలం కల్లూరుకు చెందిన లక్కోజు సంజీవరాయశర్మ అంధుడైనా, అపార గణిత మేధావిగా పేరు పొందారన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

కడప అర్బన్ : కడప నగరంలోని శంకరాపురం సరస్వతి అపార్ట్‌మెంట్ ఎదురుగా ఒక ఇంటి మొదటి అంతస్తులో ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న వెంటనే కడప ఫైర్‌స్టేషన్ అధికారి బసివిరెడ్డి ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలాన్ని చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఇంటిలో ఉంటున్న బాధితుడు సుధాకర్ తెలిపిన మేరకు దాదాపు రూ. 2 లక్షల నష్టం జరిగి ఉండవచ్చని తెలిపారు.

బీజేపీని ప్రతిఘటించే పార్టీలకే పట్టం



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్

కడప వైఎస్సార్ సర్కిల్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని ప్రతిఘటించే పార్టీలకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాలలో కర్ణాటక, తెలంగాణలో బీజేపీని ప్రతిఘటించే పార్టీలకే ప్రజలు మద్దతు తెలిపారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా బీజేపీతో తెలుగుదేశం, జనసేన పార్టీలు అంటిపెట్టుకొని ఉన్నాయని, ఈ ఎన్నికల ఫలితాలతో అయినా ఆలోచించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో బీజేపీతో తీగతెంపులు చేసుకున్న పార్టీకే సీపీఎం మద్దతు ఇస్తుందన్నారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం పోటీ చేస్తుదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు రూ.లక్షల కోట్లు రాయితీలు ఇచ్చి సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజానీకాన్ని విస్మరించిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, నాయకులు రామ్మోహన్, మనోహర్, దస్తగిరి రెడ్డి, సుబ్బమ్మ, అన్వేష్, శ్రీనివాసులు రెడ్డి, సత్య నారాయణాచారి తదితరులు పాల్గొన్నారు.

344 బస్తాల రేషన్‌బియ్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యం, లారీతో పోలీసులు

చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి ప్రధాన రహదారిలోని ఊటుకూరు సర్కిల్‌లో గల మాధవి కన్వెన్షన్ హాల్ వద్ద ఆదివారం అక్రమంగా తరలిస్తున్న 344 బస్తాల రేషన్ బియ్యంతో పాటు లారీని స్వాధీనం చేసుకున్నట్లు సీకే దిన్నె ఎస్‌ఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు ప్రొద్దుటూరు నుంచి కడప మీదుగా కర్ణాటకలోని బంగారు పేటకు రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందిందన్నారు. ఏపీ 04 టి డబ్ల్యూ 2169 నెంబర్ గల లారీని ఆపి తనిఖీ చేయగా ప్రొద్దుటూరు టౌన్‌కు చెందిన శరత్ కుమార్ 16,500 కేజీల రేషన్ బియ్యంతో పాటు 60 బస్తాల రాగులను తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. వీటి విలువ దాదాపు 18 లక్షల రూపాయలుగా ఉంటుందన్నారు. లారీ డ్రైవర్ మామిళ్ల వెంకటసుబ్బారెడ్డితో పాటు శరత్ కుమార్‌పై కేసు నమోదు చేశామన్నారు. విజిలెన్స్ అధికారి ఇదురుబాషా, ఎస్‌ఐ బాలగంగాధర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ జనార్దనరావు, కృష్ణ నాయక్, రంతుబాషా పాల్గొన్నారు.

అండర్-23 మల్టీడేస్ టోర్నీలో బౌలర్ల హవా

మూడోదశ మ్యాచ్ ప్రారంభం


కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో తలపడుతున్న సెంట్రల్‌జోన్, రెస్ట్ ఆఫ్ జోన్ జట్లు

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అంతర్ జోనల్ అండర్–23 మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌ల్లో భాగంగా మూడోదశ మ్యాచ్‌లు ఆదివారం ప్రారంభమయ్యాయి. కడప నగరంలోని కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ జోన్, సెంట్రల్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్‌జోన్ జట్టు 39.2 ఓవర్లలో 139 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని పి. సూర్యవంశీ 32 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ జోన్ బౌలర్లు ఎస్. మాధవ్ 5 వికెట్లు, జానీబాషా 4 వికెట్లతో రాణించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 16 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. జట్టులోని మనోజ్‌రాజు 35 పరుగులతో క్రీజులో ఉన్నారు. సెంట్రల్‌జోన్ బౌలర్ రుకేష్‌బాబు 3 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

కేఓఆర్‌ఎం మైదానంలో..

కేఓఆర్‌ఎం మైదానంలో నార్త్‌జోన్, సౌత్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నార్త్‌జోన్ ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్ జట్టు 50.1 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. జట్టులోని సోహన్‌వర్మ 56 పరుగులు చేశాడు. నార్త్‌జోన్ బౌలర్ వాసు 2 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.


5 వికెట్లు తీసిన రెస్ట్ ఆఫ్ జోన్ బౌలర్ మాధవ్


4 వికెట్లు తీసిన రెస్ట్ ఆఫ్ జోన్ బౌలర్ జానీబాషా

వామ్మో.. కొండ చిలువ


మృతి చెంది ఉన్న కొండ చిలువ

అట్లూరు : కడప–బద్వేలు ప్రధాన రహదారి పక్కన రెడ్డిపల్లి, అట్లూరు మధ్యలో భారీ కొండచిలువను చూసి ద్విచక్రవాహనదారులతో పాటు పాదచారులు వామ్మో..కొండ చిలువ అంటూ భయాందోళనకు గురయ్యారు. అయితే కొంతమంది స్థానికులు దగ్గరకు వచ్చి పరిశీలించగా చనిపోయి ఉండడంతో హమ్మయ్యా అని ఊపిరి పీల్చుకున్నారు. కొండచిలువ వాహనాల కిందపడి మృతి చెందిందా? లేక ఎవరైనా చంపి వేశారా అనే విషయం తెలియలేదు.

నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

ఊహించనంతగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి



ప్రజలు ఊహించనంతగా నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేశారు. ఢిల్లీలో సీఎం కేజ్రీవాల్ ప్రభుత్వ పాఠశాలలను బాగా అభివృద్ధి చేశారు అని విన్నాము. రాష్ట్రంలో సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని కళ్లారా చూస్తున్నాం. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో సరైన గదులు, టాయిలెట్‌లు, ఫ్లోరింగ్, కరెంట్, ఫ్యాన్లు వంటి కనీస సౌకర్యాలు ఉండేవి కావు. ప్రస్తుతం పాఠశాలలను చూస్తే గతంలో చదువుకున్న విద్యార్థులు ఇది తాము చదివిన పాఠశాలేనా అని ఆశ్చర్యపోతున్నారు. విద్యావ్యవస్థకు సీఎం పెద్ద పీట వేసి విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు.

– రవీంద్రుడు, ప్రధానోపాధ్యాయుడు, హోమస్‌పేట ప్రాథమిక పాఠశాల, ప్రొద్దుటూరు

రూపాయి ఖర్చు లేకుండానే ధ్రువీకరణ పత్రాలు



ఒక్క రూపాయి ఖర్చు లేకుండానే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. గతంలో ధ్రువీకరణ పత్రాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకునేవాళ్లం. అయినా సకాలంలో వచ్చేవి కావు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా స్థానిక సచివాలయంలోనే అవసరమైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని వలంటీర్ ప్రవీణ్ చెప్పడంతో నేను దరఖాస్తు చేసుకున్నాను. దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల వ్యవధిలోనే ధ్రువీకరణ పత్రాలు వచ్చాయని, సచివాలయం వద్దకు వచ్చి తీసుకెళ్లాలని వలంటీర్ చెప్పడంతో మేము వెళ్లి ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నాము. గత ప్రభుత్వ హయాంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి ఉండేది. జగనన్న ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దకే పథకాలు వస్తుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నాము.

– బెల్లం మల్లేశ్వరి, కాలువపల్లి, గోపవరం మండలం

ఆనందంగా ఉంది



నాకు గతంలో మట్టి మిద్దె ఉండేది. ఇల్లు కావాలని గతంలో చాలాసార్లు దరఖాస్తు చేసుకున్నాను. అధికారులను అడిగినా నీకు ఇల్లు మంజూరు కాలేదని చెప్పారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక మా ఇంటి వద్దకు వలంటీర్ పద్మావతి వచ్చి దరఖాస్తు చేయించి ఇంటి పట్టాతో పాటు ఇల్లు మంజూరు చేశారు. ఏడాదిలోపే ఇంటిని పూర్తి చేసుకొని నివాసముంటున్నాం. జగనన్న ప్రభుత్వంలో అడిగిన వెంటనే ఇల్లు ఇవ్వడంతో చాలా ఆనందంగా ఉంది.

– లక్ష్మి, ఉప్పలపాడు గ్రామం, కూలూరు పంచాయతీ, రాజుపాలెం మండలం

చదరంగం పోటీలకు విశేష స్పందన


విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో చెస్ అసోసియేషన్ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్ : కడప నగరం మస్తాన్‌వలి వీధిలోని చదరంగంహాల్‌లో ఆదివారం నిర్వహించిన 1వ వైఎస్‌ఆర్‌డీసీఏ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌కు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ ఎంపికలను జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 38 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. అనంతరం టోర్నమెంట్ విజేతగా పోరుమామిళ్లకు చెందిన దేవేంద్రనాథ్‌రెడ్డి 5 పాయింట్లతో ప్రథమస్థానంలో నిలిచాడు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్ శ్రీకాంత్, కోచ్ తవసు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు

(వరుసగా 1 నుంచి 10వస్థానాలు)..

దేవేంద్రనాథ్‌రెడ్డి, వంశీకృష్ణ, ఉమాదేవి, ఇనోక్, తేజేష్, లిఖిత్, చిన్మయ్, లలిత, అక్షయ్, తేజోమయి.

బీటెక్ రవి సభ్యతగా మాట్లాడటం నేర్చుకో


మీడియాతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల : తెలుగుదేశం పార్టీ నాయకుడు బీటెక్ రవి ఇప్పటికైనా సభ్యతగా మాట్లాడటం నేర్చుకోవాలని వైఎస్సార్‌సీపీ పులివెందుల నాయకులు, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డిలు హితవు పలికారు. ఆదివారం పులివెందులలో వారు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ కుటుంబంపై బీటెక్ రవి నీచమైన పదజాలంతో విమర్శలు చేశారని. రాజకీయ లబ్ధి కోసం భార్య, కొడుకుతో కూడా ప్రెస్‌మీట్లు పెట్టించి అసత్యాలు పలికించిన వ్యక్తి అని విమర్శించారు. బీజేపీ ఎంపీ సీఎం రమేష్ డైరెక్షన్‌లో బీటెక్ రవి రాయలేని, వినలేని పదాలతో విమర్శలు చేస్తున్నారన్నారు. పులివెందులలో రేకుల గుడారం లాంటి ఆఫీస్ పెడితే అరెస్టు చేయించి ఎన్‌కౌంటర్ చేయించాల్సిన దౌర్భాగ్య పరిస్థితి వైఎస్సార్‌సీపీకి పట్టలేదన్నారు. వైఎస్ కుటుబంపైన, సీఎం వైఎస్ జగన్‌పైన విమర్శలు చేస్తే హీరో కాదు.. జీరో అవుతావని పేర్కొన్నారు. బీటెక్ రవి చేసే చీకటి పనులు సింహాద్రిపురం ప్రజలకేకాక నియోజకవర్గ ప్రజలందరికి తెలుసు అన్నారు. పులివెందులను అభివృద్ధి చేసిందే వైఎస్ కుటుంబమేనని.. 15ఏళ్లు అధికారంలో ఉన్న టీడీపీ, ఎమ్మెల్సీగా ఉన్న బీటెక్ రవి పులివెందులకు ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. పులివెందుల అభివృద్ధిపై బహిరంగ చర్చకైనా, ప్రెస్‌మీట్‌కైనా సిద్ధమని సవాల్ విసిరారు. అభివృద్ధి చేసి ప్రజల మనస్సు గెలిచి ప్రజా క్షేత్రంలో గెలవాలి కానీ.. ఆత్మస్థైర్యం దెబ్బతినేలా మాట్లాడకూడదని హితవు పలికారు. సీఎం వైఎస్ జగన్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలు అనేక సంక్షేమ పథకాలతో ప్రజలను ఆదుకున్నారన్నారు. టీడీపీ మాత్రం నీరు – చెట్టు లాంటి పథకాలతో ప్రజలను దోచుకుందని ఆరోపించారు. ఇప్పటికైనా బీటెక్ రవి ప్రజల గురించి ఆలోచించాలని సూచించారు. గౌరవంగా ఉంటే బాగుంటుందని.. లేదంటే జరగబోయే పరిణామాలకు బీటెక్ రవిదే బాధ్యత అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోడిరమణ, జేసీఎస్ పట్టణ కన్వీనర్ పార్నపల్లె కిశోర్, వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్, డేనియల్ బాబు, దాసరి చంద్రమౌళి, రాజేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలి


మంజుభార్గవిని సత్కరిస్తున్న బ్రాహ్మణ ప్రముఖులు

కడప కల్చరల్ : బ్రాహ్మణుల పట్ల సమాజంలోని అన్నివర్గాల వారికి ఎంతో గౌరవముందని, వాటిని నిలుపుకుంటూ వారు అన్ని రంగాలలో రాణించాల్సిన అవసరం ఉందని సీనియర్ సినీనటి మంజు భార్గవి అన్నారు. ఆదివారం సమైక్య బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో బ్రాహ్మణులు స్థానిక సాయి శ్రీనివాస గార్డెన్స్‌లో కార్తీక వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంజుభార్గవి మాట్లాడుతూ తాను నటించిన ఎన్నో సినిమాలను ఆదరించి ప్రోత్సహించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో బ్రాహ్మణులు సంప్రదాయ ఉపాధికి పరిమితం కాకుండా సమాజంలో ఉన్నత స్థాయి గుర్తింపు, గౌరవాలు సాధించే స్థాయికి ఎదగాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా ఉదయం శివునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్థానిక కళా సంఘాల చిన్నారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. సంస్థ ప్రతినిధులు శివరావు, డాక్టర్ గోపినాథ్, ఎం.రమణయ్య, చంద్రమౌళి, బాలకృష్ణ, నగరానికి చెందిన పలువురు అర్చకులు, పురోహితులు, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన బ్రాహ్మణులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కడప సెవెన్‌రోడ్స్ సర్కిల్ వద్ద 144 సెక్షన్

కడప అర్బన్ : కడప నగరం ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సెవెన్‌రోడ్స్ సర్కిల్‌లో కట్టడం గురించి వివిధ మతాలకు చెందిన వ్యక్తులు, సంస్థల వారు అభ్యంతరం తెలియజేశారు. దీంతో సెవెన్‌రోడ్స్ వద్ద సోమవారం నుంచి ఎలాంటి వ్యక్తులుగానీ, రాజకీయ పార్టీల వారు ప్రవేశించకుండా పోలీసుల విజ్ఞప్తి మేరకు కడప తహసీల్దార్ శివరామిరెడ్డి 144 సెక్షన్ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ విషయాన్ని గమనించి పోలీసులకు, ప్రభుత్వానికి ప్రజలు సహకరించాలని తహసీల్దార్ సూచించారు.

కనుల పండువగా అయ్యప్పస్వామి లక్షార్చన


పూజాకార్యక్రమంలో అయ్యప్పస్వామి, దేవతా మూర్తులు


లక్షార్చన చేస్తున్న అయ్యప్పస్వామి దీక్షధారులు

35వేల మందికి పైగా భక్తులకు అన్నదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : పెన్నానది తీరంలోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్ప స్వామి లక్షార్చన మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉదయం స్వామి ఉత్సవమూర్తికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. గణపతి, సుబ్రమణ్య, అయ్యప్ప, వెంకటేశ్వర హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతిని సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో గణపతి, అయ్యప్పస్వామి, లక్ష్మీదేవి ఉత్సవ మూర్తులను సుందరమైన సెట్టింగ్‌లలో కొలువుదీర్చారు. 1500 మందికి పైగా అయ్యప్పస్వామి దీక్షధారులు లక్షార్చన మహోత్సవంలో పాల్గొని పసుపు, కుంకుమ, పూలు, భస్మం, పూజా ద్రవ్యాలతో లక్ష సార్లు స్వామివారిని మనసారా అర్చించి శరణు వేడారు. ఆలయ ప్రధాన అర్చకుడు నాగేంద్రశర్మ కలశాన్ని తలమీద ఉంచుకుని శరణుఘోషల మధ్య పదునెట్టాంబడిని ఎక్కి స్వామికి విభూధితో అభిషేకం చేశారు. అలాగే అయ్యప్పస్వామి ఉత్సవ మూర్తికి ఘనంగా రథోత్సవాన్ని నిర్వహించారు. లక్షార్చన సందర్భంగా దాదాపు 35వేల మందికి పైగా భక్తులకు స్వామి అయ్యప్ప సేవా సంఘం వారు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా స్వామి అయ్యప్ప సేవాసంఘం ప్రతినిధులు, దీక్షదారులు, పోలీసులు, ఆర్సీపీఈ విద్యార్థులు, వలంటీర్లు సేవలందించారు. అలాగే మరకతలింగానికి, ద్వాదశ జ్యోతిర్లింగాలకు, అష్టాదశ శక్తిపీఠాలకు, నవరత్నలింగానికి. జలలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో పెన్నా ఏటి తీరం కిటకిటలాడింది. స్వామి అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు నామా రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడు వి.ఎన్. మనోహర్, కార్యదర్శి వీఏ పద్మనాభయ్య, కోశాధికారి టి.వినోద్‌కుమార్, నామా వాసు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

రామాపురం : కర్నూలు–చిత్తూరు 40వ జాతీయ రహదారిపై చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లె సమీపంలో ఆదివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కిషోర్‌కుమార్ తన సిబ్బందితో దాడి చేసి వీటిని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఒంటిమిట్ట: మండల పరిధిలోని గుంటుగారిపల్లి–కోనరాజుపల్లి మధ్యలో ఉన్న పేకాట స్థావరంపై ఆదివారం ఒంటిమిట్ట పోలీసులు దాడి చేసి 11 మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ మధుసూదన్ రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు..

తమకు వచ్చిన కచ్చితమైన సమాచారం మేరకు దాడి నిర్వహించి 11 మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ. 1,12,300 నగదును, ఒక కారు, ఒక తుఫాన్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

ముంబై–చెన్నై కారిడార్‌లో..

లెవెల్ క్రాసింగ్ గేట్లకు మంగళం!

- రైళ్ల వేగం పెంపు నేపథ్యంలో...
- చకచకా ఆర్‌యూబీల నిర్మాణాలు
- తెల్లదొరల కాలంనాటి గేట్ విధానానికి చెల్లుచీటీ
- రూ.72 కోట్లతో కోడూరు రైల్వే పరిధిలో 9 ఆర్‌యూబీలు
- ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి కృషి




నందలూరు రైల్వేకేంద్రంలో ఆర్‌యూబీ నిర్మాణ పనులు, లెవెల్ క్రాసింగ్ గేట్

రాజంపేట : భారతీయ రైల్వేచరిత్రలో బ్రిటీషుకాలం నుంచి ఉన్న విధానాలు ఒక్కొక్కటీ కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ఇందులో ఒకటి రైల్వేగేట్ విధానం. రైలుమార్గంలో అనేక గ్రామాలకు రైల్వేగేట్ ప్రధానం. ఇప్పుడు ఒవైపు రైల్వే వేగం.. మరోవైపు సిబ్బంది భారం తగ్గించుకోవడమే లక్ష్యంగా రైల్వేశాఖ రైల్వేగేట్లకు మంగళం పాడుతోంది. ముంబై–చెన్నై కారిడార్ రైలు మార్గంలోని గుత్తి–రేణిగుంట మధ్య రైల్వేగేట్స్(లెవెల్‌క్రాసింగ్ గేట్స్)ను ఎత్తివేస్తూ వస్తున్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా సబ్‌వేలు నిర్మిస్తున్నారు.

రైళ్ల వేగం పెంపు నేపథ్యంలో..

రైళ్ల వేగం పెంపు నేపథ్యంలో ఎక్కడా కూడా రైళ్ల రాకపోకలకు అవాంతరాలు లేకుండా చేసే పనిలో భాగంగా లెవెల్ క్రాసింగ్ గేట్లను తొలగించుకుంటూ వస్తున్నారు. ఇందులో రెండు రకాల గేట్లు ఉన్నాయి. ఒకటి మనిషి కాపలా ఉన్న గేట్లు, మరొకటి మనిషి కాపలాలేని గేట్లు ఉన్నాయి. మనిషి కాపలా లేని గేటు వల్ల అనేక ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఇవి ఇలాగే కొనసాగితే వందేభారత్ లాంటి రైళ్లతోపాటు సాధారణంగా నడుస్తున్న రైళ్లు 110 కిలోమీటర్లకు పైగా వేగంతో నడుస్తున్న క్రమంలో గేట్ల వల్ల ఇబ్బందికరమైన సమస్యలు ఉత్పన్నమవుతాయని రైల్వేశాఖ భావించింది.

చకచకా ఆర్‌యూబీల నిర్మాణాలు..

ముంబై–చెన్నై రైలుమార్గంలో భవిష్యత్తులో ఎల్‌సీ గేట్లు లేకుండా చేసేందుకు రైల్వేశాఖ ప్రత్యామ్నాయంగా ప్రజల రాకపోకలకు సంబంధించి ఆర్‌యూబీ, ఆర్వోబీలను నిర్మిస్తోంది. ఇందుకు రైల్వేశాఖ, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పనులు వేగవంతంగా చేపడుతున్నారు. గ్రామాల మధ్య రైల్వే ట్రాక్స్ ఉండటం వలన రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రైల్వేశాఖ చర్యలు తీసుకుంటోంది.

ఎంపీ మిథున్‌రెడ్డి కృషి

రైలు పట్టాలకు ఇరువైపులా ఉన్న పల్లె మార్గాల్లో ఆర్‌యూబీల నిర్మాణానికి రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి విశేష కృషి చేశారు. రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే తొమ్మిది ఆర్‌యూబీల నిర్మాణాల మంజూరుకు కృషి చేశారు. రైల్వేమంత్రిని కలిసి ఎల్‌సీ గేట్లు ఎత్తివేస్తే ఇబ్బందులు పడే వారి సమస్యను విన్నవించారు. వందలాది గ్రామాల ప్రజలు గేట్లు ఎత్తి వేసే క్రమంలో ఇబ్బందులు పడకుండా ఆర్‌యూబీల నిర్మాణాలపై దృష్టి సారించారు. ఇందులో కోడూరు, బొజ్జవారిపల్లె, అనంతరాజుపేట, ఓబులవారిపల్లె, టి.కమ్మపల్లె, రెడ్డిపల్లె క్రాస్, అప్పరాజుపేటలో ఆర్‌యూబీ(సబ్‌వే)లను మంజూరు చేయించారు. వీటి నిర్మాణం కోసం రూ.72కోట్లు వ్యయం చేస్తున్నారు. కోడూరు పట్టణంలో వందేళ్ల నుంచి ఉన్న సమస్యకు ఆర్‌యూబీ నిర్మాణంతో మార్గం సుగమం చేశారు.

ఎల్‌సీ గేట్లు..ఆర్‌యూబీలు..

2023–2024 ఏడాదిలో 41 లెవల్ క్రాసింగ్ గేట్లు ఉన్నాయి. ఒక గేటు మూసివేశారు. 23 ఆర్‌యూబీ(రోడ్ అండర్ బ్రిడ్జి) నిర్మాణంలో ఉన్నాయి. 16 ఆర్‌ఓబీలు(రోడ్ ఓవర్ బ్రిడ్జి)లు మంజూరయ్యాయి. డైవర్షన్ పేరుతో ఒక గేటు మూసివేశారు.

ఉద్యోగులను వేధించడం తగదు

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులను వేధించడం ప్రభుత్వానికి తగదని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, తిమ్మన్న పేర్కొన్నారు. కడపలోని వీణా విజయరామరాజు ఎస్టీయూ భవన్‌లో ఆదివారం నిర్వహించిన రాయలసీమ జిల్లాల ముఖ్య నాయకుల సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు తీవ్ర ఆందోళనకు, మానసిక వేదనకు గురిచేస్తోందన్నారు. ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయకుండా కాలయాపన చేసి తీరా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓపీఎస్ అమలు చేయడం సాధ్యం కాదని చెప్పడం ఉద్యోగులను నిలువునా మోసం చేయడమేనన్నారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ బోధనకు అడ్డంకిగా మారిన బోధనేతర పనులైన నాడు నేడు, ఎండీఎం, జేవీకే తదితర యాప్‌ల నిర్వహణ అప్‌లోడింగ్ లాంటి పనులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్రమణ్యంరాజు, చంద్రశేఖర్, బాలగంగిరెడ్డి, దాదాపీర్, ఇలియాస్‌బాషా, భానుహరిప్రసాద్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, సీనియర్ నాయకులు సురేష్‌బాబు, రాయలసీమ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్